క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ జీడీ కానిస్టేబుల్‌గా గజ్వేల్ విద్యార్థి



సందీప్

గజ్వేల్‌రూరల్: సీఆర్‌పీఎఫ్‌లో జనరల్ డ్యూటీ కానిస్టేబుల్‌గా గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ సందీప్ ఎంపికైనట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విభాగంలో మొదటి బ్యాచ్‌కు చెందిన సందీప్ పారా మిలటరీ ఫోర్స్‌కి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపక బృందం విద్యార్థి సందీప్‌ను అభినందించారు.

వైభవంగా సుదర్శన హోమం



నాచగిరిలో హోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో సోమవారం ఉదయం శ్రీసుదర్శన హోమం అత్యంత వైభవంగా జరిగింది. యాగశాలలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి అన్నపూర్ణ పర్యవేక్షణలో వేదపండితులు హోమం నిర్వహించారు. శ్రీనృసింహ నామాలు పఠించారు. దాదాపు గంటన్నరపాటు యజ్ఞం కొనసాగింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు హోమంలో పాల్గొని తరించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు మద్దె రాజేష్ తెలిపారు. మండల పరిధిలోని కొండాపూర్‌లో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లోగా పార్టీని బలోపేతం చేసి దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ హర్షత్, కార్యదర్శులు బీడ ఎల్లం, మహేందర్, నాయకులు మల్లారెడ్డి, మురళి, అంజి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కొడుకు అన్నం పెట్టడం లేదని ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): కొడుకు, కోడలు నమ్మించి నాలుగెకరాలు పట్టా చేసుకొని అన్నం పెట్టడంలేదంటూ వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బెక్కల్‌కు చెందిన కుంచం మల్లయ్య (72)కు కుమారుడు రాజు, కోడలు అనిత ఉన్నారు. 4 ఎకరాలు, పెన్షన్ డబ్బులు తీసుకుని బాగోగులు చూడడం లేదు. దీంతో సీనియర్ సిటిజన్ యాక్ట్ మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

కార్మికులకు చీరల పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకులు మధుసూదన్‌సాయి 44వ పుట్టినరోజు సందర్భంగా శ్రీసత్యసాయి ట్రస్ ఆధ్వర్యంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు, విద్యార్థులకు పల్లిపట్టీలను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాదేవి, సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకులు నరేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'వయ్యారి భామ'పై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటరూరల్: వయ్యారి భామ కలుపు మొక్క పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అఖిల భారత కలుపు యాజమాన్య విభాగం శాస్త్రవేత్తలు రామ్ ప్రకాశ్, అఖిల రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వయ్యారిభామ మొక్క పూత దశలో ఉంటుందని, ప్రతీ మొక్క సుమారుగా 5 వేల నుంచి 25 వేల విత్తనాలను తయారు చేస్తుందన్నారు. ఈ మొక్కతో మనుషులు, పశువులకు దగ్గు, దమ్ము వస్తుందని, ఒంటిపై దద్దుర్లు ఏర్పడతాయన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో హెడ్ శాస్త్రవేత్త శ్రీదేవి, శాస్త్రవేత్తలు సాయినాథ్, పల్లవి, ఊమరాణి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం అందజేత

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని రేబర్తి పీఏసీఎస్ చైర్మన్ నాగిల్ల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డిపై అవిశ్వాస తీర్మాన ప్రక్రియను చేపట్టాలని రేబర్తి పీఏసీఎస్ డైరెక్టర్లు సోమవారం జిల్లా సహకార సంఘం అధికారికి వినతిపత్రం అందించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

శ్రావణమాసంలో వచ్చే మొదటి పండుగ నాగుల పంచమిని జిల్లావ్యాప్తంగా సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్ట వద్ద కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలు పోసి చల్లగా చూడాలని వేడుకున్నారు. సిద్దిపేటలోని కోటిపడగల సంతాన నాగదేవత ఆలయానికి భక్తులు పోటెత్తారు.



ఆలయంలో భక్తుల రద్దీ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంతాన నాగదేవత ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



గజ్వేల్ పట్టణంలోని నల్ల పోచమ్మ దేవాలయ ఆవరణలో పుట్ట వద్ద మహిళల పూజలు



హుస్నాబాద్: మరకత లింగేశ్వర ఆలయం వద్ద..



వర్గల్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఎజెండా అన్నారు. అక్కన్నపేట మండలంలో రూ. 21 కోట్ల 76 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం వ్యాప్తంగా కరెంట్ కోతలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మూడోసారి కూడా బీఆర్‌ఎస్ టికెట్ తనకే ఇవ్వడం పట్ల సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి సతీష్‌కుమార్‌కు టికెట్ కేటాయించటంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు అక్కన్నపేట, రామవరం గ్రామాల్లో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేష్, పంచాయితీ రాజ్ డీఈఈ సదాశివ రెడ్డి, ఏఈ స్నేహ, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

దుబ్బాక ఆస్పత్రి మరో రికార్డు



దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రి మరో రికార్డు అందుకుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో పలు విభాగాల్లో అత్యుత్తమ వైద్యసేవలు అందించి ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న విషయం విదితమే. తాజాగా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి జూలైలో జరిగిన జనరల్ సర్జరీల్లో రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో భైంసా ఏరియా ఆసుపత్రి నిలిచింది. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు



మిరుదొడ్డిలో..



తొగుటలో..



జగదేవ్‌పూర్‌లో..

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సతీష్‌కుమార్‌ను మూడోసారి ప్రకటించడంపై సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు, నాయకులు అయిలేని శంకర్‌రెడ్డి, చిట్టి గోపాల్‌రెడ్డి, రమేష్ నాయక్, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తొలి జాబితాలో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఖరారు కావడంపై మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం హర్షం వ్యక్తం చేశాయి. పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, కో అప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కిష్టయ్య, సత్యనారాయణ, శంకర్, గూళ్ల పుష్పబాగులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, యువజన నాయకులు కుమార్, నితిన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మొదటి జాబితాలో ప్రభాకర్‌రెడ్డి పేరు ప్రకటించగా అంబేద్కర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీలు స్వామి, నర్సింలు, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, కో ఆప్షన్ సభ్యుడు కలీమొద్దీన్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ నుంచి మూడో సారి కేసీఆర్ పోటీ చేస్తున్నానని ప్రకటించడంతో సోమవారం జగదేవ్‌పూర్‌లో బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అలాగే తిగుల్, ఇటిక్యాల, చాట్లపల్లి, తిగుల్, మునిగడప తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు కాల్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణం కాపాడుదాం

గజ్వేల్‌రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హరిత హారం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

'సిద్దిపేట టికెట్ కేటాయించండి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌కు టీపీసీసీ చీఫ్ సెక్రటరీ పూజల హరికృష్ణ దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుర్రం అంజిరెడ్డి, గౌటి బాపేష్, దొంతిరెడ్డి, రాజేశం గౌడ్, కనకయ్య, యాదగిరి, మహేందర్‌రెడ్డి, పద్మారెడ్డి, రాజు, దుర్గం రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తిగుల్‌కు బస్సు సౌకర్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇటీవల సర్పంచ్ భానుప్రకాష్‌రావు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం డిపో మేనేజర్ తిగుల్ గ్రామానికి బస్సు వేశారు. సర్పంచ్ ఆధ్వర్యంలో బస్సుకు ఘన స్వాగతం పలికారు.

◆ నూతన నియామకం

వర్గల్(గజ్వేల్): వర్గల్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కుక్కల శ్రీనివాస్‌యాదవ్ (తున్కిఖాల్సా) ఎన్నికయ్యారు. సోమవారం వర్గల్‌లో జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు రవీందర్ యాదవ్ పర్యవేక్షణలో మండల యాదవ సంఘ కార్యవర్గ ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా మామిళ్ల స్వామి కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా మహేష్ ఎన్నికయ్యారు.



◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నారాయణరావుపేట మండలం, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల, ఎన్సాన్‌పల్లి, కిష్టసాగర్, పట్టణంలోని నర్సాపూర్, రంగథాంపల్లి, లింగారెడ్డి పల్లి, ఇమాంబాద్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని సిద్దిపేట డివిజనల్ ఇంజినీర్ మహేష్ సోమవారం తెలిపారు.

◆ ఆర్థిక సహాయం

కొండపాక(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన నిరుపేద కుటుంబాలను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మాట మహిపాల్‌రెడ్డి, స్వామి, రవి, కనకరాములు, యాదగిరి, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ దూల్మిట్ట తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన గోపాల్ మద్దూరు మండల నాయబ్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి నాయబ్ తహసీల్దార్‌గా చేసిన శ్రీనివాస్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.



దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఆలయం

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

23 నుంచి దుబ్బాక వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

దుబ్బాకటౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి దుబ్బాకలో కొలువుదీరి రెండేళ్లు అవుతున్న సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. దుబ్బాక పట్టణంలో నిర్మించిన బాలాజీ ఆలయం అనతికాలంలోనే తెలంగాణ తిరుపతిగా.. గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. ఈనెల 23 నుంచి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

2009 నవంబర్ 1న దుబ్బాకలో బాలాజీ ఆలయ నిర్మాణానికి త్రిదండి చినజీయర్ స్వామి భూమి పూజ చేశారు. 12 ఏళ్ల పాటు సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో పట్టణంలో రెండెకరాల స్థలంలో టీటీడీ ప్లానింగ్, వాస్తు ప్రకారం ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అద్భుతంగా ఆలయం రూపుదిద్దుకుంది. 2015లో దుబ్బాకకు వచ్చిన సీఎం కేసీఆర్ అరగంటకుపైగా బాలాజీ ఆలయ నిర్మాణ పనులు సందర్శించి వెంటనే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (దేవాదాయ శాఖ) నుంచి రూ. 3 కోట్లు మంజూరు చేయించారు.

ఆరురోజులు అంగరంగ వైభవంగా

ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 23వ తేదీ బుధవారం సాయంత్రం ఆరు గంటలకు బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. 24న గురువారం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 25 శుక్రవారం కుంకుమార్చన, సాయంత్రం రాయబారం, ఎదుర్కోలు ఉత్సవం, 26 శనివారం ఉదయం దంపతులతో వెంకటేశ్వర వ్రతం, సాయంత్రం వెంకటేశ్వస్వామి కల్యాణోత్సవం చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో జరగనుంది.



ఆలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామి

హాజరుకానున్న ప్రముఖులు

బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి



ఎర్రవల్లిలో లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): గొల్ల, కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రవల్లికి రెండో విడత కింద మంజూరైన 12 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గొల్ల, కురుమల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్‌లు భాగ్య భిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, అఖిల భారత యాదవ మహాసభ మండలాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు శ్రీశైలం, ఆంజనేయులు, బాబు, మహేందర్, సంతోష్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

దుబ్బాక: సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కౌన్సిలర్లు నంద్యాల శ్రీజ శ్రీకాంత్, కూరపాటి బంగారయ్య అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేయడం హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిద్దిపేటరూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను పోలీస్‌లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, సహాయ కార్యదర్శి నాచారం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటజోన్: మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో కౌన్సిలర్లు సురేందర్, ప్రవీణ్, నాగరాజు ఆధ్వర్యంలో మైనంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే ముస్తాబాద్ చౌరస్తాలో కౌన్సిలర్ కవిత ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు.

క్షమాపణ చెప్పాలి..

గజ్వేల్: మంత్రి హరీశ్‌రావుపై మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలు శోచనీయమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మండిపడ్డారు. సోమ వారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఆశీస్సులు, ప్రజల మద్దతుతో ఎదిగిన హరీశ్‌రావుపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా మైనంపల్లి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



సిద్దిపేటలో మైనంపల్లి హన్మంతరావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు